క్లుప్తంగా

మద్యంషాపులకు దరఖాస్తు చేసుకోండి

మణుగూరు రూరల్: మద్యం దుకాణాల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని మణుగూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబేషన్ సీఐ ఆర్.రాజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–27 సంవత్సర కాలపరిమితికి గాను మణుగూరు ఎక్సైజ్‌శాఖ పరిధిలో మొత్తం 15 మద్యం దుకాణాల లైసెన్స్ జారీకి రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. మణుగూరు మండలంలో బండారుగూడెం–6 (ఎస్టీ ఏజెన్సీ), గుట్టమల్లారం–2 (ఎస్టీ), అశ్వాపురం మండలంలో అశ్వాపురం/గొల్లగూడెం–2 (ఎస్టీ), మొండికుంట–1 (గౌడ్), పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం–2 (ఎస్టీ ఏజెన్సీ), జానంపేట–1 (ఎస్టీ), కరకగూడెం మండలంలో కరకగూడెం –1(ఎస్టీ ఏజెన్సీ) మద్యం దుకాణాల ఏర్పాటుకు గెజిట్ జారీ అయ్యిందన్నారు. ఆసక్తి గల వారు రూ.3 లక్షల డీడీ తీసి, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్‌లను జతచేసిన దరఖాస్తులను ఈ నెల 18లోపు జిల్లా ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు 8712658855 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ప్రశంసాపత్రం అందుకుంటున్న కత్రి దాసు

ములకలపల్లి: మండలపరిధిలోని జగన్నాథపురం హైస్కూల్ పదో తరగతి విద్యార్థి కత్రి దాసు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం కొత్తగూడెంలో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ పాఠశాలల అండర్ 17 క్రీడాపోటీల్లో పాల్గొన్న దాసు, షార్ట్‌పుట్ డిస్క్‌త్రో విభాగాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు హెచ్‌ఎం వెంకటనర్సమ్మ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఆదివాసీ సంక్షేమ పరిషత్ కమిటీ ఎన్నిక

మణుగూరు రూరల్: మండలకేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల నూతన కమిటీని మణుగూరు డివిజన్ అధ్యక్షుడు సోలం హరిశంకర్, ప్రధాన కార్యదర్శి తుర్రం రవికుమార్ సమక్షంలో బుధవారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా మడి రమేష్, ప్రధాన కార్యదర్శిగా మడకం ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కొండ్రు నాగేందర్, కంగాల ప్రవీణ్, గౌరవ అధ్యక్షుడిగా కొమరం కోటి, కోశాధికారిగా మడకం ప్రవీణ్, కార్యదర్శులుగా వాడ రాంబాబు, గొగ్గల కోటేష్, గనిబోయిన రాము, సుతారి సురేష్, సోలం సంపత్, సోలం కుమార్‌స్వామి, వంక మల్లయ్య, వంక శేఖర్, బోడిక శ్రీనులను ఎన్నుకున్నారు.

తినుబండారాల్లో నాణ్యత మెరుగుపర్చాలి

మణుగూరు రూరల్: సింగరేణి కార్మికులకు క్యాంటీన్‌లో అందజేస్తున్న తిను బండారాల్లో నాణ్యతా ప్రమాణాలను మరింతగా మెరుగుపర్చాలని టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం ఆయన మల్లేపల్లి ఓసీ గని సందర్శించి కార్మికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలను గని మేనేజర్ బైరెడ్డి వెంకటేశ్వర్లుకు వివరించి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిగెల నాగేశ్వరరావు, సుద్దాల సంపత్‌కుమార్, దిశెట్టి రమేష్, మస్తాన్, మురళీకృష్ణ, కటారి ప్రసాద్, సుధాకర్, బీరయ్య, వినోద్, సతీష్‌కుమార్, నాగశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

భద్రాచలంఅర్బన్: రోడ్డు ప్రమాదంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. టౌన్ ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలం పట్టణంలోని ఓం శాంతి సత్రం ప్రాంతంలో బుధవారం ఉదయం ఆటో డ్రైవర్ వెంకటేష్ తన ఆటోను నిర్లక్ష్యంగా నడపుతూ అదే రోడ్డులో స్కూటీని ఢీ కొట్టాడు. ఈ మేరకు స్కూటీపై ఉన్న ఇద్దరు కింద పడిపోయి గాయాలపాలయ్యారు. ఈ మేరకు ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ప్రత్యేక ప్రోత్సాహక నగదు జమ చేయాలి

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో కాంట్రాక్ట్ కార్మికులకు, ప్రైవేట్ డ్రైవర్లకు, సెక్యూరిటీ గార్డులకు యాజమాన్యం లాభాల నుండి ప్రకటించిన ప్రత్యేక ప్రోత్సాహక నగదు రూ.5,500 వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో బుధవారం ఏరియా పర్సనల్ మేనేజర్ సింగు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎల్‌బీకెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌డి.నాసర్‌పాషా, కాంట్రాక్ట్ కార్మికులు దయాకర్, దుర్గా, వెంకటరమణ, రమాదేవి, రాజు, రాము, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రక్షకబుట్టలపై అవగాహన లేమి



పత్తిలో ఏర్పాటు చేసిన లింగాకర్షక బుట్టలు

లింగాకర్షక బుట్టలతో పత్తిలో గులాబీ పురుగుకు చెక్

- పురుగుమందుల ఖర్చు తగ్గించే ట్రాప్స్
- అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోతున్న అన్నదాతలు

కరకగూడెం: లక్షల రూపాయల పెట్టుబడి పెట్టినా అన్నదాతకు పత్తి పంట ఏటా కన్నీళ్లే మిగులుస్తోంది. ఆశించిన దిగుబడి రాక, అప్పులు తీరక రైతులు కుమిలిపోతున్నారు. దీనికి ప్రధాన కారణం కాయ తొలిచే గులాబీ రంగు పురుగు. దీని కారణంగా పంట మొత్తం నాశనం అవుతుంటే, పురుగుమందుల కోసం లక్షల ఖర్చు పెట్టాల్సి వస్తోంది. గులాబీ పురుగు నియంత్రణకు లింగాకర్షక బుట్టలు (ఫెరోమోన్ ట్రాప్స్) అనేది ఒక విప్లవాత్మకమైన సాధనం. తక్కువ ఖర్చుతో రసాయనాలు లేకుండా ఈ బుట్టలు అందుబాటులో ఉన్నా రైతులకు కనీస అవగాహన కూడా లేదు. వీటి వాడకంపై వ్యవసాయ శాఖ అధికారులు సైతం నోరు మెదపక, క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించటంలో నిర్లక్ష్యం వహించడంతో రైతులు నష్టపోతున్నారు.

ఇవీ ప్రయోజనాలు..

ఈ బుట్టలు ఏర్పాటుచేసుకుంటే పురుగుమందుల ఖర్చు తగ్గుతుంది. రసాయనాలు తక్కువగా వాడటం వల్ల పత్తి నాణ్యత పెరుగుతుంది. మిత్ర పురుగులైన తేనెటీగలు, సాలెపురుగులు వంటి వాటికి ఎలాంటి హానీ జరగదు. పొలంలో ఎప్పుడు పురుగుల ఉధృతి పెరుగుతుందో ముందుగానే గుర్తించి, సరైన సమయంలో చర్యలు తీసుకోవడానికి ఉపయోగపడతాయి.

అందని సబ్సిడీ, సమాచారం..

లింగాకర్షక బుట్టలు చాలా తక్కువ ధరకే అందుబాటులో ఉన్నా ప్రచారం లేక కొనుగోలు చేయలేకపోతున్నారు. ఒక్కో బుట్ట ధర దాదాపు రూ.50 నుంచి రూ.80, ఒక్కో గుళిక ధర రూ.20 నుంచి రూ.30 మధ్య ఉంటుంది. గత ప్రభుత్వాలు ఈ లింగాకర్షక బుట్టలను సబ్సిడీపై పెద్ద ఎత్తున పంపిణీ చేయగా ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి సబ్సిడీ అమలులో లేవు. ఈ బుట్టలతో ఇంత మంచి ఫలితం ఉన్నా ఎక్కువ శాతం రైతులు ఉపయోగించడం లేదు. దీనికి ప్రధాన కారణం వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యమే. రైతులకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, కొత్త పద్ధతుల గురించి క్షేత్ర స్థాయిలో తెలియజేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ఈ బుట్టల వాడకాన్ని ఒక ఉద్యమంలా చేపడితే పురుగుల ఉధృతి నుంచి రైతులకు ఉపశమనం లభించి ఆర్థికంగా మేలు చేకూరుతుంది.

ఎలా పనిచేస్తుందంటే..



బుట్ట వద్ద అతికిన పురుగులు

పత్తి విత్తనం వేసిన 45 నుంచి 60 రోజుల తర్వాత లేదా మొక్కల్లో పువ్వులు కనిపించడం ప్రారంభించినప్పుడు బుట్టలు ఏర్పాటు చేయాలి. ప్రతీ ఎకరానికి 5 నుంచి 8 బుట్టలు, పురుగు ఉధృతి ఎక్కువుంటే 15 నుండి 20 బుట్టలను నేల నుండి దాదాపు 1 మీటర్ ఎత్తులో కర్రకు మొక్కల పైన ఉండేలా చూసుకోవాలి. ఈ బుట్టల్లో ఉన్న ఫెరోమోన్ ల్యూర్ గుళిక ప్రభావం దాదాపు 20 నుండి 30 రోజులు మాత్రమే ఉంటుంది కాబట్టి ప్రతీ 20 రోజులకు కొత్త గుళికను మార్చాలి. ఈ గుళిక నుంచి ఆడపురుగు విడుదల చేసే వాసనను పోలి ఉండే వాసన రావడంతో మగగులాబీ పురుగులు బుట్టల వద్దకు వస్తాయి. బుట్టలోకి వచ్చిన పురుగులు బయటకు వెళ్లలేక అక్కడే చిక్కుకుపోయి చనిపోతాయి. దీంతో మగపురుగులు లేక ఆడ పురుగులకు సంతానోత్పత్తి జరగక పురుగుల ఉధృతికి అడ్డుకట్టపడుతుంది.

అవగాహన కల్పించాలి



నేను పదేళ్లుగా పత్తి వేస్తున్నా. పురుగు వస్తే పాతకాలపు మందు కొట్టడమే మాకు తెలుసు. లింగాకర్షక బుట్టలు వ్యవసాయ అధికారులు పొలాల దగ్గరికి వచ్చి చెప్పకపోవడంతో మాకు తెలియక నష్టపోతున్నాం. అధికారులు సకాలంలో అవగాహన కల్పించాలి. ప్రభుత్వం సబ్సిడీ అందించాలి.

– కొమరం సత్యం, రైతు, అల్లేరుగూడెం

రైతులు మక్కువ చూపడం లేదు



లింగాకర్షక బుట్టలు గులాబీ రంగు పురుగును నియంత్రించడానికి ఉత్తమమైన మరియు పర్యావరణ అనుకూలమైన పద్ధతి. మేము రైతు వేదికల్లో విరివిరిగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అయితే క్షేత్ర స్థాయిలో కొంతమంది రైతులు వీటిని ఉపయోగించడానికి మక్కువ చూపడం లేదు.

– చటర్జీ, ఏఓ, కరకగూడెం

ఎమ్మెల్యే జారె విస్తృత పర్యటన



అయ్యప్ప పీఠంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

దమ్మపేట: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మండలంలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని నాగుపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మినారాయణ స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాముల పీఠం ప్రారంభంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా గండుగులపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న తుమ్మల చెన్నారావును పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గూర్చి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ విధానానికి లోబడే పొత్తులు



మాట్లాడుతున్న మచ్చ వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్: రాజకీయ విధానాలకు లోబడే స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తులు ఉంటాయని, బీజేపీకి వ్యతిరేకంగా కలిసొచ్చే ప్రజాతంత్ర లౌకిక పార్టీలతో ఎన్నికల అవగాహన కుదుర్చుకుంటామని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అన్నారు. బుధవారం స్థానిక దామల్ల వెంకన్న అధ్యక్షతన మండల కమిటీ శాఖ కార్యదర్శిల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండలంలో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని, ఎవరితో పొత్తు ఉన్నా లేకున్నా పార్టీ సంస్థగత బలం ఉన్న ప్రతిచోట అభ్యర్థులను నిలబెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, మండల నాయకులు సత్రపల్లి సాంబశివరావు, కొడిశాల రాములు, మడి నర్సింహారావు, పిట్టల నాగమణి, బొల్లం రాజు, కుంజా నర్సింహారావు, కుంజా శ్రావణ్ కుమార్, కొండ్రు గౌరి, ములకల ఉత్తమ్, కారం భీమయ్య, ఖతీజా భేగం, సున్నం మల్లేశ్ తదితరులు ఉన్నారు.

పశువులకు సమయానికి టీకాలు వేయించాలి



పశువులను పరీక్షిస్తున్న వైద్యులు

దుమ్ముగూడెం: ప్రతీ 3 నుంచి 6 నెలలకు ఒకసారి డీ వార్మింగ్ చేయడం, సమయానికి టీకాలు వేయిస్తే పశువులను వ్యాధుల నుండి రక్షించవచ్చని వెటర్నరీ వైద్యులు ఎస్.లిఖిత, సుధారాణి అన్నారు. మండలంలోని రేగుబల్లి గ్రామంలో భద్రాచలం రోటరీక్లబ్ సహకారంతో స్థానిక పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పశువుల మేగా హెల్త్ క్యాంప్ విజయవంతమైంది. ఈ శిబిరంలో గ్రామీణ రైతులకు పశువుల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు పశువులకు ఉచిత వైద్య సేవలు, ఔషధాలు సలహాలు అందించారు. ప్రమాదకర వ్యాధులపై అవగాహన కల్పించి, పశువులకు స్వచ్ఛమైన నీరు, సమతుల ఆహారం పరిశుభ్రత చాలా ముఖ్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రెసిడెంట్ వి. వరలక్ష్మి, సెక్రటరీ బాలశ్రీ కృష్ణ మహేంద్ర, కోశాధికారి హరి ప్రసన్న కుమార్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ షేక్ అజీం, ప్రోగ్రాం చైర్మన్ మల్లికార్జున రావు, పూర్వ అధ్యక్షులు యశోదా రాంబాబు, ప్రభాకర్ గుప్తా, జక్కరయ్యపాల్గొన్నారు.

కొనసాగుతున్న డైలీవేజ్ వర్కర్ల సమ్మె



సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు

దమ్మపేట: మండలంలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లు, చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 27వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు వర్కర్ల సమ్మెకు సీపీఎం నాయకులు మద్దతు తెలిపి మాట్లాడుతూ... కార్మికులను చర్చలకు పిలిచి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పాత పద్ధతిలోనే వేతనాలను చెల్లించి, ఉద్యోగ, ఆరోగ్య భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. మురహరి రఘు, కార్మికులు నాగేశ్వరరావు, సుబ్బారావు, రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ బలపడేందుకు డిక్షనరీలు దోహదం



డిక్షనరీలతో విద్యార్థులు

మణుగూరు టౌన్: మణుగూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత ఇంగ్లిష్ డిక్షనరీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ నాగబాబు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, ఎంఈఓ స్వర్ణజ్యోతి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్ బలపడేందుకు నిఘంటువులు దోహదపడతాయన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులు కృషి చేసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ స్థాపకులు చెరుకుపల్లి ఉపేంద్రరావు, గౌరవాధ్యక్షులు గంగాధర వీరయ్య, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం సుధాకర్‌రెడ్డి, సంస్థ సభ్యులు నిమ్మనగోటి వీరయ్య, ఉప్పాడ అనిత, దామర మల్లయ్య, రావులపెంట నరసరావు, తిగుళ్ల శ్రీనివాసరావు, సత్యనారాయణ, మాదుగుల నర్సారావు, తరంగిణి, రాజకుమారి తదితరులు ఉన్నారు.

‘స్థానిక’ ఎన్నికలకు బీఎస్పీ సిద్ధం



మాట్లాడుతున్న కౌశిక్

చర్ల: స్థానిక సంస్థల ఎన్నికలకు చర్ల మండలంలో బీఎస్పీ సిద్ధంగా ఉందని పార్టీ మండలాధ్యక్షుడు కొండా కౌశిక్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలతో పాటు ఒక జెడ్పీటీసీ స్థానానికి పార్టీ పోటీ చేస్తుందని ఇందుకోసం గ్రామగ్రామాన పార్టీని మరింతగా బలోపేతం చేస్తున్నామన్నారు. పార్టీ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు చెన్నం మోహన్ రావు, గుర్రాల విజయ్‌కుమార్, బాషా, చెన్నం పవన్, పంబీ కుమారి, ములకల సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వితరణ



ఐడీ కార్డులు, బెల్టులు, నోట్ బుక్స్ పంపిణీ అనంతరం విద్యార్థులతో దాతలు

పినపాక: మండలపరిధిలోని ఈ బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం బెల్టులు, ఐడీ కార్డులు, నోట్ బుక్స్ వితరణగా అందజేశారు. గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి మారంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు 20 వేల రూపాయలు విలువగల వస్తువులను అందజేయగా ఎంఈఓ కొమరం నాగయ్య అభినందించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

భద్రాచలంటౌన్: సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయిపై దాడికి ప్రయత్నించిన న్యాయవాది రాకేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్ రాజ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. న్యాయమూర్తిపై దాడి మాల మహానాడు తీవ్రంగా ఖండిస్తుందని, మంచి చెడులను తెలుసుకుని మసులుకోవాలని లేనిపక్షంలో అంబేడ్కర్ వాదులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

బెదిరిస్తున్న వారిపై..

చర్ల: ఎమ్మెల్యే పీఏను అంటూ తనను బెదిరిస్తూ, ఇసుక క్వారీల్లో కమీషన్లు, వాటాలు ఇవ్వాలని తనపై దాడి చేసి, తనను హతమారుస్తానంటూ బెదిరిస్తున్న వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని నాయకపోడు తెగకు చెందిన కాపుల నాగరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని తేగడలో సోమవారం నవాబ్ అనే వ్యక్తి తనపై దాడి చేయగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదేరోజు రాత్రి తన ఇంటి వద్దకు కొంతమందితో వచ్చి మళ్లీ దాడి చేసేందుకు యత్నించారన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

‘జెడ్పీటీసీ’ జనరల్ కావడం రాజ్యాంగ విరుద్ధం

దుమ్ముగూడెం: పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన దుమ్ముగూడెం మండలం జెడ్పీటీసీ ఓసీ జనరల్ రావడం రాజ్యాంగ విరుద్ధమని ఆదివాసీ సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ఆర్లగూడెం గ్రామంలో తెలంగాణ జాబ్ కమిటీ సభ్యులు వర్సా ముద్దరాజు అధ్యక్షతన ఐక్య కార్యాచరణ కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులకు అవకాశం కల్పించడం సరికాదన్నారు. అన్ని పార్టీలు ఆదివాసీ నాయకులకు జెడ్పీ టికెట్ కేటాయించకుండా 1/70 చట్టానికి విరుద్ధంగా ఏజెన్సీ ప్రాంతానికి వలస వచ్చిన గిరిజనేతరులను వెనకేసుకరావడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై పార్టీలన్నీ అభ్యంతరాలు తప్పకుండా తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐక్య కార్యాచరణ గౌరవాధ్యక్షుడు కొమరం దామోదరావు, నాయకులు తెల్లం హరికృష్ణ, తునికి కామేశ్వరరావు, రేసు ఆదినారాయణ, పెనుబల్లి చంటి, అడ్వకేట్ బృందం కొర్సనరేష్ , కారం రమేష్, కారం పుల్లయ్య, కుర్సం రవి, సోంది మల్లూరు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో బియ్యం, పండ్లు పంపిణీ

అశ్వాపురం: మణుగూరు ఏరియా సింగరేణి కార్మికుడు ఓసీ 2 ఎస్‌అండ్‌డీ ఎలక్ట్రికల్ మెయింటనెన్స్ సెక్షన్‌లో పనిచేస్తున్న నాగుల సతీష్ రజిత దంపతుల కుమారులు శ్లోక్ దైవిక్, శర్విన్ దివిత్ జన్మదినం సందర్భంగా అశ్వాపురం ఆరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమానికి బుధవారం క్వింటా బియ్యం వితరణగా అందజేశారు. వృద్ధులకు సహపంక్తి భోజనాలు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి సభ్యులు యస్‌డి. నాసర్ పాషా, నాగుల సతీష్, రజిత, నాగుల జ్యోతి, యశోద పద్మ, నాగుల సుగుణ, వెంకటి, రవికుమార్, మహేష్, గాయత్రి, షేక్ మెహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

‘సెంట్రల్’ లేక అంధకారంలోనే..



చిమ్మచీకట్లో ములకలపల్లి మండలకేంద్రం

ములకలపల్లి: మండలకేంద్రంలోని ప్రధాన రోడ్డులో చిమ్మచీకట్లతో అంధకారం అలముకుంటోంది. సెంట్రల్ లైటింగ్ నిమిత్తం రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. ఈ మేరకు 1,200 మీటర్ల మేర రోడ్డు విస్తరణ చేసి, విద్యుత్ స్తంభాలను మార్చి 45 అడుగుల్లో వేశారు. ఐతే ఆయా స్తంభాలకు నేటికి వీధిలైట్లు ఏర్పాటు చేయలేదు. దీంతో రెండేళ్లుగా పాల్వంచ– మండలపల్లి ప్రధాన రహదారిలో అంధకారం రాజ్యమేలుతోంది. సాయంత్రం దుకాణాలు తీసి ఉన్నంత సేపు మాత్రమే ఆయా షాపుల్లోని లైట్ల వెలుగు ఉంటోంది. షాపులు బంద్ కాగానే ప్రధాన రహదారి చీకటవుతోంది. దీంతో ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి లైట్లుఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయమై జీపీ కార్యదర్శి రవిని వివరణ కోరగా, నిధుల లేమివల్ల లైట్లు ఏర్పాటులో జాప్యం జరుగుతోందని, ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు..

- కారు ఢీకొనడంతో సగభాగం ధ్వంసం
- రోజులు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు





ధ్వంసమై ప్రమాదకరంగా మారిన కల్వర్టు

దుమ్ముగూడెం: మండలంలోని కాటాయిగూడెం గ్రామ శివారులో ములకపాడు–మారాయిగూడెం రోడ్డుపై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం భద్రాచలం–చర్ల ప్రధాన రహదారి అంతా గోతులమయంగా మారడంతో ఈ రోడ్డు గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారి అంతరాష్ట్ర ప్రయాణానికి అనుకూలంగా ఉండి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని గ్రామాలకు, ఆంధ్రాలోని వివిధ ప్రాంతాలకు ప్రజలు గమ్యస్థానాలకు చేరుకుంటారు. కానీ ఈ రోడ్డు సరిగ్గా మలుపులో ఉన్న కల్వర్ట్ ఒక వైపు ధ్వంసమవడంతో ప్రమాదకరంగా మారింది. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొన్నిరోజుల క్రితం మారాయిగూడెం వైపు నుంచి లక్ష్మీనగరం వస్తున్న కారు కల్వర్టును ఢీ కొట్టడంతో సగభాగం ధ్వంసమైంది. ఇది జరిగి చాలా రోజులు జరుగుతున్నప్పటికీ నిత్యం రోడ్లను పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖ అధికారులు దానిని పరిశీలించకపోవడం పట్ల ప్రజల నుండి విమర్శలు వస్తున్నాయి.

పట్టించుకోకుంటే అంతే..

కల్వర్టు దగ్గర అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో అటువైపుగా వెళ్తున్న వాహనాలు అదుపుతప్పి కల్వర్టులోకి దూసుకుపోతున్నాయి. ఇప్పటికే పలువురు క్షతగాత్రులుగా మారిన ఘటనలు సైతం ఉన్నాయి. ధ్వంసమైన కల్వర్టు వెనక చెట్లు ఉండటంతో రాత్రి ప్రయాణించే సమయంలో సరిగ్గా కనబడక వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణాలు పోకముందే అధికారులు గుర్తించాలని వాహనదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి, పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

మరమ్మతు చేపట్టాలి..



ప్రమాదకరంగా మారిన కల్వర్టు మరమ్మతులను అధికారులు వెంటనే చేపట్టాలి. చర్ల–భద్రాచలం ప్రధాన రహదారి అధ్వానంగా మారిన నేపథ్యంలో ఎక్కువ మంది ములకపాడు –మారాయిగూడెం రహదారినే ఉపయోగిస్తూ తమ గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. అలాంటి రహదారిలో ప్రమాదాలు సంభవించక ముందే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేపట్టాలి.

– కణితి రాముడు, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్